




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :174 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ శుక్రవారం- 24 - జూలై- 2026


## ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు
# డిమాండ్ చేయడం లేదు?

- ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్
- తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ



హైదరాబాద్ : తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పనితీరుపై మిగతా..2లో

## యూపీఏ హయాంలో పేపర్లు లీక్.. కాంగ్రెస్ నేతలు ఎందుకు రాజీనామా చేయలేదు



- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.
- మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు.

న్యూఢిల్లీ, జులై 23: దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాలలో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ప్రాచీన కళను కాపాడేందుకు కార్పొరేట్ జాబ్‌కు గుడ్‌బై
## దేశ, విదేశాల్లో 'బజ్జికా పెయింటింగ్స్' ఫుల్ పాపులర్

- ❖ అంతరించిపోయే దశకు చేరుకున్న ప్రాచీక కళ
- ❖ బజ్జికా పెయింటింగ్స్‌కు గుర్తింపును తీసుకొచ్చిన కాంచన్ ప్రకాశ్- మరికొంత మందికి శిక్షణ ఇస్తున్న మహిళ

ఢిల్లి : కళలు అంతరించిపోవడం కొందరికి నచ్చదు. అందుకే దాన్ని రక్షించడానికి నడుం బిగించి ముందుకు సాగుతారు. అలాంటి కోవకు చెందిన వ్యక్తే బిహార్‌లోని ముజఫర్‌పుర్‌కు చెందిన డాక్టర్ కాంచన్ ప్రకాశ్. ఆమె అంతరించిపోయే దశకు చేరుకున్న సంప్రదాయ కళ 'బజ్జికా పెయింటింగ్స్' ఉనికిని కాపాడుతున్నారు. దేశవిదేశాల్లో ఆ పెయింటింగ్స్‌కు మంచి పేరును తెచ్చిపెడుతున్నారు. అందు కోసం కార్పొరేట్ ఉద్యోగానికి సైతం గుడ్‌బై చెప్పేశారు. ఇంతకీ 'బజ్జికా పెయింటింగ్స్' అంటే ఏమిటి? దానికున్న చరిత్ర ఏంటి? తదితర విషయాలు తెలుసుకుందాం.

### గత 25 ఏళ్లుగా కృషి



బజ్జికా పెయింటింగ్ అనేది ముజఫర్‌పుర్ పక్కన ఉన్న బజ్జికాంచల్ ప్రాంతానికి చెందిన పురాతనమైన జానపద కళ. ఒకప్పుడు వివాహాలు, శుభకార్యాల సమయంలో గ్రామాల్లోని ఇళ్ల మట్టి గోడలపైనే ఈ చిత్రాలను (బజ్జికా పెయింటింగ్స్) గీసేవారు. కాలక్రమేణా మట్టి ఇళ్ల స్థానంలో కాంక్రీటు భవనాలు రావడంతో ఈ కళ కనుమరుగవ్వడం ప్రారంభమైంది. అయితే ఇప్పుడు ఈ బజ్జికా పెయింటింగ్స్‌ను కాన్వాస్‌పై తీర్చిదిద్దుతున్నారు. ఈ కళను కాపాడేందుకు డాక్టర్ కాంచన్ ప్రకాశ్ గత రెండున్నర దశాబ్దాలుగా తీవ్రంగా కృషి చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపైకి ఈ కళను తీసుకెళ్లారు. కళను కాపాడేందుకు రెండున్నర దశాబ్దాలుగా కృషి చేస్తున్న కాంచన్ గత 20- 25 ఏళ్లుగా ఈ జానపద కళను పరిరక్షించడానికి తాను పూర్తిగా అంకితమయ్యానని డాక్టర్ కాంచన్ ప్రకాశ్ తెలిపారు. మొదట్లో తన ఇంటి గోడలపై, మిగతా..2లో

## భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి



- యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.
- ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు.

హైదరాబాద్, జులై 23: యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమనమంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు.

## గ్లోబేరినా వివాదంలో సీఎం రేవంత్ కి బిగ్ షాక్..
# 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి..

### లీగల్ నోటీసులు పంపిన కేటీఆర్

- సీఎం రేవంత్‌రెడ్డికి లీగల్ నోటీసులు
- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి
- లేదంటే పరువు నష్టం దావా
- తెలంగాణ రాజకీయం మరోసారి హీటెక్కింది.



హైదరాబాద్: గ్లోబేరినా టెక్నాలజీస్ వ్యవహారంలో తనపై అసత్య ఆరోపణలు చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దీ=ూ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు లీగల్ నోటీసులు జారీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మీడియా ముఖంగా తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే 48 గంటల్లో రేవంత్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ నోటీసులో స్పష్టంగా డిమాండ్ చేశారు.

మిగతా..2లో


## ప్రతి వర్షపు చుక్కనూ
# కాపాడుకుందాం



- ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచన

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, మిగతా..2లో

## ఆగస్టు 7న 'నేతన్న సేవ' ప్రారంభం,..51,952 మంది చేనేతలకు
## ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం తో చేనేతకు కొత్త ఊతం....



- రాష్ట్రవ్యాప్తంగా 51,952 మంది అర్హులైన నేతన్నలకు
- ప్రతి సంవత్సరం రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం
- చేనేత కళాకారులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా గౌరవప్రదంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని

అమరావతి: రాష్ట్ర చేనేత రంగానికి మరో కీలక ప్రోత్సాహక కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం 'నేతన్న సేవ' పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వచ్చే ఆగస్టు 7న ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రకటించారు. మిగతా..2లో

## మరో దేశంపై సైనిక దాడికి ట్రంప్ ఏర్పాట్లు?

అమెరికా మరొక దేశంపైకి యుద్ధానికి వెళ్లబోతుందా? ప్రపంచంలో మరో యుద్ధం ఖాయమా? అంటే అవుననే సమాధానం వస్తోంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో దేశంలో సైనిక చర్య చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



ఢిల్లి : పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న జమాత్ నుస్రత్ అల్-ఇస్లాం వల్-ముస్లిమీన్ అనే అల్‌ఖైదా అనుబంధ ఉగ్రసంస్థపై వైమానిక దాడులు చేపట్టే అంశాన్ని ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ది వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే.. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అమెరికా సైనిక దాడులకు అనుమతించిన ఎనిమిదో దేశంగా మాలీ నిలవనుంది. విదేశీ యుద్ధాలను తగ్గిస్తానని గతంలో హామీ ఇచ్చిన ట్రంప్.. ఇప్పుడు ఉగ్రవాద వ్యతిరేక చర్యలను మిగతా..2లో

## భూమన ఆక్రమించిన భూముల స్వాధీనానికి ఏపీ ప్రభుత్వం చర్యలు




- తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమించిన భూముల స్వాధీనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- సర్వే నంబర్ - 47/1 లో 5.1 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటోంది.

తిరుపతి, జులై 23 : తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమించిన భూముల స్వాధీనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సర్వే నంబర్ - 47/1లో 5.1 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటోంది. అలాగే, సర్వే నంబర్ 47/5లో 3.7 ఎకరాల భూమి స్వాధీనానికి చర్యలు చేపట్టింది. స్వాధీనం చేసుకున్న భూముల వద్ద ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## చాలా అంశాల్లో మంత్రులు
# వెనకబడిపోతున్నారు..

### ఏపీ కేబినెట్ భేటీలో సీఎం

- ఏపీ మంత్రివర్గ సమావేశంలో మంత్రులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సూచనలు చేశారు.
- వివిధ ప్రభుత్వ శాఖల్లో 3,120 పోస్టుల భర్తీకి సంబంధించి కేబినెట్ ఆమోదం కోసం వచ్చిన ప్రతిపాదనను మరోసారి అధ్యయనం చేయాలని ఆదేశించారు.



మిగతాది 2లో

## అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్... సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం



- అమరావతిలో క్వాంటం ఫైనాన్స్ హబ్ ఏర్పాటు చేయనున్న పీఎన్‌బీ
- రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య కీలక ఒప్పందం
- దేశంలోనే ఇలాంటి హబ్ ఏర్పాటు చేస్తున్న తొలి బ్యాంకుగా పీఎన్‌బీ
- బ్యాంకింగ్ సైబర్ భద్రత, మోసాల నివారణే ప్రధాన లక్ష్యం
- డిజిటల్ అక్షరాస్యత పెంచాలని సీఎం చంద్రబాబు సూచన

## మొదటి పేజీ తరువాయి

# భూమన ఆక్రమించిన భూముల స్వాధీనానికి ఏపీ ప్రభుత్వం చర్యలు

జేసీబీలతో భూమన ఆక్రమిత భూముల చుట్టూ ఉన్న ప్రహారీలను రెవెన్యూ అధికారులు కూలగొడుతున్నారు. వందలాదిమంది పోలీసులతో ప్రభుత్వం బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమిత భూములను పరిశీలించడానికి అక్కడికి సాధు పరిషత్తు స్వాములు చేరుకున్నారు. ఆ స్థలం వద్దకు సాధు పరిషత్తు స్వాములను పోలీసులు అనుమతించలేదు. దూరం నుంచే మీడియాతో సాధు పరిషత్ స్వాములు మాట్లాడారు.

భూమనను ప్రజలు త్వరలోనే తరిమికొడతారు: శ్రీనివాసానంద

భూమన కరుణాకర్ రెడ్డిని తిరుపతి ప్రజలు త్వరలోనే తరిమికొడతారని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి హెచ్చరించారు. భూమన కుటుంబంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసిన ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు.

ఆ భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి: అట్లూరి నారాయణ

భూమన కరుణాకర్ రెడ్డి భూకబ్జాలను వెనక్కు తీసుకున్నందుకు కూటమి ప్రభుత్వానికి ఏపీ సాధుపరిషత్ గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణ ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ రికార్డులను కూడా మార్చాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూబకాసురుల భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమన సాత్వికుడిగా మాట్లాడుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. లక్ష టిప్పర్లతో కాంక్రీట్ పోశారని ఆరోపించారు. భూమన అభినయరెడ్డి రెవెన్యూ అధికారులను, పోలీసులనే బెదిరిస్తున్నారని అట్లూరి నారాయణ ఆగ్రహించారు.

# గ్లోబేరినా వివాదంలో సీఎం రేవంత్ కి బిగ్ షాక్.. 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి.. లీగల్ నోటీసులు పంపిన కేటీఆర్

గ్లోబేరినాతో ఎలాంటి సంబంధం లేదు:

గ్లోబేరినా సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలుగానీ లేదా యాజమాన్య హక్కులుగానీ లేవని కేటీఆర్ స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ కంపెనీ అని, దానికి సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ పూర్తిగా అవాస్తవాలని ఖండించారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ఆధార రహిత, బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం తగదని ఆయన హితవు పలికారు.

క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా!

కేవలం రాజకీయ లబ్ధి పొందడం కోసం, తన వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే దురుద్దేశంతోనే ముఖ్యమంత్రి ఈ తప్పుడు వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఇచ్చిన గడువులోగా రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు భారీ మొత్తంలో పరువు నష్టం దావా వేస్తామని లీగల్ నోటీసు ద్వారా కేటీఆర్ స్పష్టం చేశారు.

# ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం

తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు?

ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

# భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి

యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు. యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు. 2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం అందిస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల గొంతు వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయన్నారు. 'భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మరో దేశంపై సైనిక దాడికి ట్రంప్ ఏర్పాట్లు?

మరింత విస్తరిస్తున్నారనే చర్చ మొదలైంది.

వైట్ హౌస్‌లో భిన్నాభిప్రాయాలు

ఈ ప్రతిపాదనపై అమెరికా ఉన్నతాధికారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైట్ హౌస్ జాతీయ భద్రతా మండలిలో ఉగ్రవాద నిరోధక విభాగం సీనియర్ డైరెక్టర్ సెబాస్టియన్ గోర్కా సైనిక చర్యకు మద్దతు ఇస్తున్న ప్రముఖ అధికారుల్లో ఒకరుగా పేర్కొంటున్నారు. అయితే మరికొందరు అధికారులు మాత్రం ఈ చర్యపై సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రంప్ తొలి ప్రభుత్వంలో పనిచేసిన మాజీ అధికారి పీటర్ ఫామ్ మాట్లాడుతూ.. సైనిక చర్యకు ముందు మాలీ, నైజర్ ప్రభుత్వాలతో నమ్మకాన్ని పునరుద్ధరించడం అవసరమని అభిప్రాయపడ్డారు. "మాలీ వంటి దేశాల్లో అమెరికాకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాలు పెద్దగా లేకపోయినా.. ఐసిస్, అల్‌ఖైదా వంటి జిహాదీ ఉగ్రవాద సంస్థలు అక్కడ బలపడకూడదు." అని అన్నారు.

మాలీలో ఉగ్రవాదం

వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం.. జీఎ×వీ ప్రస్తుతం మాలీలో బలమైన స్థావరాన్ని ఏర్పరుచుకుని పొరుగు తీరప్రాంత పశ్చిమ ఆఫ్రికా దేశాలకు కూడా తన కార్యకలాపాలను విస్తరించింది. దీంతో సాహెల్ ప్రాంతం ప్రపంచంలోనే ఉగ్రవాద కార్యకలాపాల ప్రధాన కేంద్రంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో జీఎ×వీ దేశవ్యాప్తంగా సైనిక స్థావరాలపై భారీ దాడులు చేసి వ్యూహాత్మక ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆత్మాహుతి దాడిలో మాలీ రక్షణ మంత్రిని హతమార్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. 2020, 2021 సైనిక తిరుగుబాట్ల తర్వాత అధికారంలోకి వచ్చిన మాలీ సైనిక ప్రభుత్వం.. ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తొలుత వాగ్నర్ గ్రూప్, అనంతరం ఆఫ్రికా కార్ప్స్ పేరుతో రష్యా కిరాయి బలగాల సహాయాన్ని తీసుకుంటోంది. అయితే రష్యా మాలీలో సమర్థవంతమైన భద్రతా భాగస్వామిగా నిరూపించుకోలేకపోయిందని అమెరికా ప్రభుత్వం విమర్శించింది. అలాగే మాలీ భద్రతా బలగాలు, రష్యా కిరాయి సైనికులు పౌరులపై మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని పలు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి. మాలీపై అమెరికా నేరుగా సైనిక చర్య చేపడితే.. అక్కడ ఇప్పటికే ఉన్న రష్యా బలగాలతో ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సిరియాలో అమలు చేసినట్లుగా ప్రత్యేక సమన్వయ వ్యవస్థ అవసరమయ్యే పరిస్థితి ఏర్పడవచ్చని భావిస్తున్నారు. సౌఫాన్ సెంటర్‌కు చెందిన సీనియర్ పరిశోధకుడు వాస్సిం నస్ర్ మాట్లాడుతూ.. మరోసారి సైనిక చర్య చేపట్టడం వల్ల సమస్య పరిష్కారం కాదని అన్నారు. "ఫ్రాన్స్ పదేళ్లపాటు సైనిక చర్యలు చేపట్టింది.. రష్యా ఐదేళ్లుగా ప్రయత్నిస్తోంది. కానీ పరిస్థితి మరింత దిగజారింది. కాబట్టి రాజకీయ చర్చలు, రాజీ ప్రయత్నాలే శాశ్వత పరిష్కారం." అని అభిప్రాయపడ్డారు. ఇంకా కొందరు విశ్లేషకులు.. అమెరికా దాడులతో జీఎ×వీ బలహీనపడినా.. దాని వల్ల ఐసిస్ అనుబంధ ఉగ్రసంస్థలు మరింత బలపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అమెరికా మిషనరీ రక్షణ అంశం కూడా చర్చలో మాలీలో ఇస్లామిక్ ఉగ్రవాదుల చెరలో ఉన్నట్లు భావిస్తున్న అమెరికా మిషనరీ కెవిన్ రైడౌట్ను రక్షించే అంశం కూడా అమెరికా అంతర్గత చర్చల్లో ప్రధాన అంశంగా మారిందని ది వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. ప్రస్తుతం మాలీలో అమెరికా సైనిక చర్యపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు.

# చాలా అంశాల్లో మంత్రులు వెనకబడిపోతున్నారు..

## మొదటి పేజీ తరువాయి



అమరావతి, జులై 23: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సూచనలు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 3,120 పోస్టుల భర్తీకి సంబంధించి కేబినెట్ ఆమోదం కోసం వచ్చిన ప్రతిపాదనను మరోసారి అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైన ఉద్యోగాలు కోసం మరోసారి అధ్యయనం చేసి ప్రతిపాదనలు పంపాలని కోరారు. మంత్రులు తమ శాఖల పనితీరుపై మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు. చాలా అంశాల్లో మంత్రులు వెనుకబడిపోతున్నారని సీఎం అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిన తర్వాత, ఆ అంశంపై ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇద్దరూ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి(రాష్ట్రాదీ)లో ఆమోదం పొందిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో సమీక్షించాలని సీఎం ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయారు' అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డీఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం.

# యూపీఏ హయాంలో పేపర్లు లీక్.. కాంగ్రెస్ నేతలు ఎందుకు రాజీనామా చేయలేదు

## మొదటి పేజీ తరువాయి

ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహీన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు



రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

# ప్రాచీన కళను కాపాడేందుకు కార్పొరేట్ జాబ్‌కు గుడ్‌బై- దేశ, విదేశాల్లో 'బజ్జికా పెయింటింగ్స్' ఫుల్ పాపులర్

## మొదటి పేజీ తరువాయి

సంప్రదాయ కార్యక్రమాల సమయంలో ఈ చిత్రాలను రూపొందించేదానినని చెప్పారు. కానీ ఈ కళారూపానికి ఒక కొత్త మాధ్యమం లభించకపోతే రానున్న తరాలకు ఈ పెయింటింగ్ చేరదని గ్రహించానని వెల్లడించారు. ఈ ఆలోచనతో తాను సంప్రదాయ వాటర్ కలర్స్ ఉపయోగించి కాన్వాస్‌పై బజ్జికా పెయింటింగ్స్‌ను రూపొందించడం ప్రారంభించానని పేర్కొన్నారు. "నేను బజ్జికా పెయింటింగ్స్ గీయడం మొదలుపెట్టినప్పుడు సోషల్ మీడియా యుగం ఇంకా రాలేదు. ఫలితంగా మా కళ పరిమిత సంఖ్యలో ఉన్న ప్రజలకు మాత్రమే చేరువయ్యేది. నేడు సోషల్ మీడియా పుణ్యమా అని మా కళ దేశ, విదేశాల్లోని ప్రజలకు చేరుతోంది. అలాగే బజ్జికా పెయింటింగ్ కళాకారులు కొత్త గుర్తింపును పొందుతున్నారు. మా అమ్మ, అమ్మమ్మ నుంచి ఈ విద్యను నేర్చుకున్నాను" అని కాంచన్ ప్రకాశ్ స్పష్టం చేశారు.

### అంతరించిపోయే దశకు చేరుకున్న ప్రాచీక కళ దేశ విదేశాల్లో బజ్జికా పెయింటింగ్స్‌కు గుర్తింపు



అయితే ప్రస్తుతం కాంచన్ ప్రకాశ్ గీసిన బజ్జికా పెయింటింగ్స్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఆమె రూపొందించిన కొన్ని ఎంపిక చేసిన బజ్జికా పెయింటింగ్స్‌ను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించారు. అంతేకాకుండా బెల్జియంలోని 'మ్యూజియం ఆఫ్ సేక్రెడ్ ఆర్ట్', 'బిహార్ మ్యూజియం', 'బిహార్ కళా అకాడమీ' వంటి అనేక ప్రతిష్ఠాత్మక వేదికలపై ఆమె కళాఖండాలు ప్రదర్శితమయ్యాయి. మరోవైపు, బజ్జికా పెయింటిగ్స్‌లో రాణించినందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అందించే జజూ సీనియర్ ఫెలోషిప్, ఏఐఎఫ్‌సీఎస్ అవార్డు, బిహార్ స్టేట్ అవార్డు, కుముద్ శర్మ సీనియర్ కాంటెంపరరీ ఉమెన్ ఆర్టిస్ట్ అవార్డు వంటివి కాంచన్‌ను వరించాయి. కాంచన్ ప్రకాశ్ మార్గదర్శకత్వంలో అనేకమంది యువ కళాకారులు బజ్జికా పెయింటింగ్స్ గీయడం నేర్చుకుని స్వయం సమృద్ధిని సాధించారు. ఒకప్పుడు గ్రామీణ గోడలకే పరిమితమైన ఈ చిత్రాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇళ్లు, ఆర్ట్ గ్యాలరీలకు చేరుతున్నాయి.

### సంప్రదాయ జానపద కళ

ముజఫర్‌పుర్, వైశాలి, సీతామర్హి, షెయోహర్, తూర్పు చంపారన్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ప్రాంతాన్ని బజ్జికాంచల్ అంటారు. అక్కడ బజ్జికా పెయింటింగ్స్ ఒకప్పుడు చాలా పాపులర్. బజ్జికా పెయింటింగ్స్ కేవలం అలంకరణకు మాత్రమే పరిమితమైనవి కాదు. ఇవి జానపద కళ, మత విశ్వాసం, వివాహ ఆచారాలు, వ్యవసాయ సంస్కృతి, ప్రకృతి, సామాజిక విలువలకు దృశ్యరూపం. బజ్జికాంచల్ ప్రాంతంలో పెళ్లికి ముందు చేసే మత్కోర్ పూజ సమయంలో మహిళలు ఇంటి గోడలపై ఈ పెయింటింగ్స్‌ను వేసేవారు. ఈ చిత్రాల్లో వెదురు, ఏనుగులు, పక్షులు, చేపలు, పువ్వులు, ఆకులు, ఇతర శుభ చిహ్నాలు ఉంటాయి. వెదురు వంశ వృద్ధికి, శ్రేయస్సుకు, ఆనందానికి ప్రతీక అని అక్కడి ప్రజల నమ్మకం. అందువల్ల పెళ్లి సందర్భంగా వెదురు ఫొటోలను చిత్రీకరిస్తారు.

# అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్... సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

## మొదటి పేజీ తరువాయి



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక టెక్నాలజీలకు కేంద్రంగా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ)లో "క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్" ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మధ్య ఒక ముఖ్యమైన ఒప్పందం కుదిరింది. గురువారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఏపీ క్వాంటం మిషన్, పీఎన్‌బీ ఈ అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా ఒక క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన మొట్టమొదటి బ్యాంకుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలవడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో పీఎన్‌బీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ చంద్ర, ఏపీ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు కానున్న ఈ హబ్, బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది. ముఖ్యంగా బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను గణనీయంగా పటిష్టం చేయడం, ఆర్థిక మోసాలను ముందుగానే పసిగట్టే వ్యవస్థలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలను సురక్షితంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. కేవలం బ్యాంకింగ్ రంగానికే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సమిష్టి ఆవిష్కరణలకు ఊతమివ్వనుంది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన టెక్నాలజీలలో పరిశోధనలను ప్రోత్సహించడం, అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడం కూడా ఈ హబ్ కార్యకలాపాల్లో భాగం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, క్వాంటం, డీప్ టెక్నాలజీలకు ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ హబ్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం ఆ దిశగా వేస్తున్న మరో కీలకమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. డిజిటల్ లావాదేవీలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, వినియోగదారులకు, సాధారణ ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, బ్యాంకులపై ఉందని పీఎన్‌బీ ఉన్నతాధికారులకు సూచించారు. "డిజిటల్ అరెస్ట్" వంటి ఆధునిక సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే టెక్నాలజీ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు అత్యుత్తమ భద్రతను అందించాలని స్పష్టం చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర మాట్లాడుతూ, డిజిటల్ బ్యాంకింగ్‌ను మరింత పటిష్ఠంగా, సురక్షితంగా, సులభతరంగా మార్చేందుకే అమరావతిలో ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కేంద్రం ద్వారా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎన్‌బీకి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# ఆగస్టు 7న 'నేతన్న సేవ' ప్రారంభం,..51,952 మంది చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం తో చేనేతకు కొత్త ఊతం....

## మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా 51,952 మంది అర్హులైన నేతన్నలకు ప్రతి సంవత్సరం రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుకు బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. చేనేత కళాకారులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా గౌరవప్రదంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆమె పేర్కొన్నారు...

### చేనేతకు సంక్షేమం.. అభివృద్ధికి ద్విచక్ర వ్యూహం

చేనేత రంగం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు.. వేలాది కుటుంబాలకు జీవనాధారం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి చర్యలను సమాంతరంగా అమలు చేస్తోంది. ఇప్పటికే ఉచిత విద్యుత్, వృద్ధాప్య పెన్షన్లు, నూలు కొనుగోలుపై సబ్సిడీ వంటి పథకాలు అమల్లో ఉండగా.. ఇప్పుడు నేతన్న సేవ కూడా చేరడంతో చేనేత కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా లభించనుంది.

### ఒకే కుటుంబానికి ఏడాదికి రూ.81 వేల నుంచి రూ.94 వేల వరకు లబ్ధి

మంత్రి సవిత వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల చేనేత కుటుంబాలకు గణనీయమైన ఆర్థిక లబ్ధి కలగనుంది. మగ్గం నేతన్నలకు చేనేత వృత్తిలో దశాబ్దాల పాటు శ్రమించిన కళాకారులకు వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పెన్షన్ అందిస్తోంది. ప్రస్తుతం 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు నెలకు రూ.4 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేస్తోంది. ఈ పెన్షన్ వల్ల వృద్ధాప్యంలో కూడా కనీస జీవన భద్రత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### చేనేత రంగానికి కొత్త టెక్స్‌టైల్స్ పాలసీలి

సంక్షేమంతో పాటు పరిశ్రమాభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో కొత్త టెక్స్‌టైల్స్ పాలసీ అమలు చేస్తూ, వివిధ ప్రాంతాల్లో టెక్స్‌టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేసే చర్యలు చేపట్టింది. దీనివల్ల చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

### నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ

చేనేత ఉత్పత్తిలో ప్రధాన ముడిసరుకు అయిన నూలు ధరలు పెరగడం నేతన్నలకు భారంగా మారుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందిస్తోంది. అలాగే చేనేత సహకార సంఘాల బలోపేతానికి థ్రిఫ్ట్ ఫండ్ కింద ప్రతి సంవత్సరం రూ.5 కోట్లు కేటాయిస్తోంది.

### టీటీడీతో ఆప్కో చారిత్రక ఒప్పందంలి

చేనేత వస్త్రాలకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాల్లో టీటీడీ-ఆప్కో ఒప్పందం ఒకటి. ఆప్కో చరిత్రలో తొలిసారిగా టీటీడీతో ఒప్పందం కుదరడంతో చేనేత ఉత్పత్తులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోంది.

### 365 రోజుల ఉపాధే ప్రభుత్వ లక్ష్యంలి

చేనేత రంగంలో సీజనల్ ఉపాధి సమస్య ఎప్పటి నుంచో ఉంది. కొన్ని నెలలు మాత్రమే పనులు ఉండటం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు 365 రోజులపాటు నిరంతర ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వ కార్యాచరణ కొనసాగుతోందని మంత్రి సవిత తెలిపారు. ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

ప్రగడ కోటయ్య జయంతికి రాష్ట్ర పండుగ హోదాలి

చేనేత ఉద్యమానికి విశేష సేవలందించిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. చీరాలలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించి, చేనేత రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటామని మంత్రి తెలిపారు. చేనేత చరిత్రలో ప్రముఖుల సేవలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

రాజకీయ విమర్శలకు మంత్రి సవిత కౌంటర్

మీడియా సమావేశంలో మంత్రి సవిత రాజకీయ అంశాలపైనా స్పందించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై విమర్శలు చేస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు అమలు కాలేదని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, డీఎస్సీ, సంపూర్ణ మద్యపాన నిషేధం, అమ్మఒడి వంటి హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసి హామీని నిలబెట్టుకుందని తెలిపారు. గతేడాది నిర్వహించిన మెగా డీఎస్సీని కూడా పారదర్శకంగా పూర్తి చేశామని మంత్రి పేర్కొన్నారు.

చేనేత రంగానికి దీర్ఘకాలిక ప్రోత్సాహమే లక్ష్యం

చేనేత రంగం ప్రస్తుతం ముడిసరుకు ధరలు, మార్కెట్ పోటీ, యాంత్రీకరణ ప్రభావం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రత్యక్ష నగదు సాయం, ఉచిత విద్యుత్, పెన్షన్, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాలు, టెక్స్‌టైల్స్ పార్కులు వంటి చర్యలు సమగ్రంగా అమలైతే చేనేత రంగానికి దీర్ఘకాలిక ఊతం లభించే అవకాశం ఉంది. అయితే పథకాల అమలులో అర్హుల ఎంపిక, నిధుల సకాలంలో విడుదల, ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ కల్పించడం వంటి అంశాలపై కూడా సమర్థవంతమైన అమలు అవసరం.

# 29 కోట్లతో ఎస్ఎన్‌డీపీ పనులకు శ్రీకారం
# సాకేత్ కాలనీలో పరిశీలించిన మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

దశాబ్దాల నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషితో నిధుల మంజూరు జరిగిందన్న మాజీ కార్పొరేటర్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి:-** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వంపుగూడ డివిజన్ పరిధిలోని సాకేత్ కాలనీ మీదుగా రూ.29 కోట్ల వ్యయంతో చేపట్టనున్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ఎస్ఎన్‌డీపీ పనులను మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కాప్రా డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న నాలా, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ఈ పనులు ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో రూ.29 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనుల ద్వారా కాప్రా, వంపుగూడ డివిజన్ల ప్రజలకు ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఉమ్మడి కాప్రా డివిజన్ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా కొనసాగుతున్న నాలా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిలకు కృతజ్ఞతలు తెలుపుతూ సాకేత్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్వర్ణరాజ్ శివమణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దండ్ల మురళీ, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పత్తి కుమార్, ఉమ్మడి కాప్రా డివిజన్ కో-ఆర్డినేటర్ సీతారాం రెడ్డి, వంపుగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనూప్ రాజ్ యాదవ్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి, మాజీ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, కాంగ్రెస్ నాయకులు పి. పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, రాకేష్ యాదవ్, కే. రాజు, రిజ్వాన్ ఖాన్, ముర్తుజా చోటు భాయ్, శ్రీనివాస్, మహిళా నాయకురాలు జ్యోతి, ఉమ్మడి కాప్రా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు మనోజ్ కుమార్, ఇమ్రాన్, దయాకర్, విజయ్, యశ్వంత్, ఆభి వర్మ, భరత్‌తో పాటు సాకేత్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# టిడబ్ల్యూజేఎఫ్‌లో
# చేరిన మేడ్చల్ సీనియర్ జర్నలిస్టులు

జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఫెడరేషన్ ఉద్యమాలకు మద్దతుగా సభ్యత్వం



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి:-** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చేపడుతున్న ఉద్యమాలకు మద్దతుగా మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు ఫెడరేషన్‌లో చేరారు. మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ సర్కిల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు కల్కూరి ఎల్లయ్య, కాడిగల శ్రీకాంత్, జవహర్‌నగర్‌కు చెందిన ఆర్.సి. శ్రీకాంత్‌తో పాటు పలువురు జర్నలిస్టులకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకురాలు ఎస్.కె. సలీమా సభ్యత్వ పత్రాలు అందజేసి ఫెడరేషన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం గురువారం కాప్రా సర్కిల్‌లోని ఏఎస్‌రావునగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వం పొందిన జర్నలిస్టులు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాడుతోందని, ఆ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఫెడరేషన్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి బనావత్ రవి నాయక్, జిల్లా నాయకులు సుధాకర్, విష్ణు, నర్సింహ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 2BHK అంబేద్కర్ నగర్ డ్రైనేజీ
# శానిటేషన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తాత్కాలిక పనులు స్వస్తి చెప్పి, రూ. 50 లక్షలతో శాశ్వత పరిష్కారం చూపాలి

అధ్యయన యాత్రలో సీపీఎం మండల కార్యదర్శి మంద సంపత్, బీఆర్ఎస్ నాయకులు సౌరం రఘు డిమాండ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో జూలై 23:** హనుమకొండలోని 30వ డివిజన్ పరిధిలోని 2దీఎఖ అంబేద్కర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న అండర్ డ్రైనేజీ, శానిటేషన్, రీసైక్లింగ్ మరియు తాగునీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించా లని సీపీఎం హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సౌరం రఘు ఘాటుగా డిమాండ్ చేశారు. గురువారం 30వ డివిజన్ పరిధిలో ననిర్వహించిన లి"సమస్యల అధ్యయన యాత్ర"లిలో భాగంగా నాయకులు అంబేద్కర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**బాధితుల గోడు నాయకుల ఆగ్రహం**

ఈ సందర్భంగా మంద సంపత్, సౌరం రఘు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇల్లు కేటాయించి ఏడాది గడుస్తున్నా, కనీస మౌలిక వసతులు కల్పించడం లోఅధికారులు, పాలకులు పూర్తిగా విఫల మయ్యారని మండిపడ్డారు. రూ. 2 నుండి 4లక్షలదనపు భారం: ఇళ్లు లభించి నప్పటికీ విద్యుత్, పైప్‌లైన్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలను బాగుచేసు కోవడానికి ఒక్కో పేద కుటుంబం సుమారు రూ. 2 లక్షల నుండి రూ. 4 లక్షల వరకు సొంతంగా ఖర్చు పెట్టుకోవాల్సి రావడం శోచనీయమన్నారు.

**ముంపు ప్రమాదం వర్షం వస్తే ఇంట్లోకి మురుగు:**

అస్తవ్యస్తంగా ఉన్న అండర్ డ్రైనేజీ వ్యవస్థ వల్ల చిన్న పాటి చినుకు పడినా డ్రైనేజీ నీరు ఇళ్లలోకి చేరుతోంది. డ్రైనేజీ నుండి నీరు సింక్ అయి రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి.

**శాశ్వత పరిష్కారానికి నిధుల కొరత:**

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి కనీసం రూ. 50 లక్షలు అవసరమ వుతాయని పై అధికారులకు గానీ, ప్రభుత్వానికి గానీ నివేదించడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కేవలం తాత్కాలిక ఉపశమన పనులతో కాలయాపన చేస్తున్నారు.

తీవ్ర తాగునీటి ఎద్దడి: దినం విడిచి దినం నీటి సరఫరా జరుగు తున్నప్పటి కీ, ఒక కుటుంబానికి కావలసినంత మంచినీరు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆరోగ్య సమస్యలు 2,000 మందికి ఇబ్బందులు:**

కలెక్టర్, కమిషనర్, ఈఈ, ఏఈ, ఆర్ఐలకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని విమర్శించారు. పొరుగునున్న ప్రెస్ క్లబ్, బస్టాండ్, స్విమ్మింగ్ పూల్ ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీరంతా ఈ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోకి చేరడం వల్ల, ఖాళీ స్థలాల్లో పొదలు పెరిగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, సుమారు 2,000 మంది ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవు ఆతున్నారని తెలిపారు.

**తక్షణ చర్యలు లేకుంటే పోరాటం**

బాధితుల సమస్యలను తక్షణమే గుర్తించి శాశ్వత పరిష్కారం చూపకపోతే కాలనీ వాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకార్యక్రమా లు చేపడతామని హెచ్చరిం చారు. ఈ అధ్యయన యాత్రలో హనుమకొండ సౌత్ మండల కమిటీ సభ్యులు ఇస్లావత్ రవీందర్, జగనాల ఉప్పలయ్య, వెంకన్న, కొమురయ్య, సాంబయ్య, మొగిలి, నిర్మల, నర్సింగ్, శ్రీనాథ్, బయ్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# బోనాలకు ముందే
# గ్రామానికి కొత్త వెలుగులు

కోడిచర్ల-కాచిగూడ తండాల్లో వీధి దీపాలు, పరిశుభ్రత పనులు, ఏర్పాట్లు



**షాద్‌నగర్ జోన్ ఇంచార్జ్ జూలై 23:** బోనాల పండుగను పురస్కరించుకుని షాద్‌నగర్ నియోజకవర్గంలోని కోడిచర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలోని కోడిచర్ల తండా, కాచిగూడ తండాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్, వార్డు సభ్యులు వినోద్ నాయక్, బిచ్య నాయక్, లలిత భాస్కర్ నాయక్, సంతోష్ నాయక్ సంయుక్తంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. బోనాల సందర్భంగా రాత్రి వేళల్లో భక్తులు, గ్రామస్థులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రోడ్ల వెంట పెరిగిన కలుపు మొక్కలను డోజర్‌తో తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. అదే సమయంలో రానున్న హరితహారం కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్ల పక్కన మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం కూడా చేపడుతున్నారు. వెలుతురు, పరిశుభ్రత, పచ్చదనం అనే మూడు అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న ఈ పనులు గ్రామ ప్రజల్లో ప్రశంసలు అందుకుంటున్నాయి. బోనాల పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని కోడిచర్ల తండా, కాచిగూడ తండాల ప్రజలు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు చూపుతున్న చొరవ ఆదర్శప్రాయమని గ్రామ ప్రజలు కొనియాడారు.

# తాగి వాహనం నడిపితే జరిమానా
# తప్పదు హన్మకొండ ట్రాఫిక్ పోలీసుల చర్యలు!

15 మంది మద్యం బాబులకు ?
23,400 జరిమానా విధించిన మేజిస్ట్రేట్
లైసెన్స్ లేని ముగ్గురికి రూ.1,200 ఫైన్
వరంగల్ సిపి శ్వేతా రెడ్డి పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో జూలై 23:** వీమద్యం మత్తులో వాహనా లు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వాహనదారులపైహన్మకొండ ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతు న్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి పర్యవేక్షణలో గురువారం హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనిర్వహించిన 'తనిఖీల డ్రైవ్'లో పట్టుబడి న పలువురువాహనదారుల కు స్థానిక న్యాయస్థానం జరిమానాలు విధించింది. ఈ తనిఖీల వివరాలను హన్మకొండ ట్రాఫిక్ సీఐ కె. ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

**కోర్టు విధించిన జరిమానాల వివరాలు:**

డ్రంకన్ అండ్ డ్రైవ్: తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కిన 15 మంది వ్యక్తుల ను గౌరవ మేజిస్ట్రేట్ కె. రాజశేఖర్ రెడ్డి ఎదుట హాజరుపరచగా, వారికి 23,400 జరిమానా విధించారు. లైసెన్స్ లేని వాహనదారులు: డ్రైవింగ్ లైసెన్స్ (ఖా) లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన ముగ్గురు (03) వ్యక్తులకు కోర్టు ?1,200 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

**ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక**

రోడ్డు ప్రమాదాల నివారణకే క్రమం తప్పకుండా డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం తాగి వాహనాలు నడిపినా, సరైన పత్రాలు లేకుండా ప్రయాణించినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధన లు పాటించి

# ‘నీట్’ అక్రమాలపై ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా:
# సోనియా, ప్రియాంకలతో కలిసి
# పాల్గొన్న ఎంపీ కడియం కావ్య!

విద్యార్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండించిన వరంగల్ ఎంపీ

నీట్ లీకేజీపై ప్రధాని మోదీ మౌనం వీడాలి: ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్

పార్లమెంట్‌లో చర్చకు కేంద్రం వెనకాడుతోందని విమర్శ



వరంగల్ జిల్లా బ్యూరోజూలై 23: దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, న్యాయం కోరుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం న్యూఢిల్లీలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని బాధితులకు పూర్తిస్థాయి సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలతో కలిసి ఎంపీ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నిరసన గళం విప్పారు. విద్యార్థులపై బలప్రయోగం దురదృష్టకరం: ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు: శాంతియుత ఆందోళనలపై దాడులు: “నీట్ అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వారి సమస్యలను విని పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, న్యాయం అడుగుతున్న వారిపైనే పోలీసులతో బలప్రయోగా నికి దిగడం అత్యంత దురదృష్టకరం.” చర్చకు జంకుతున్న కేంద్రం: కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలని విపక్షాలు కోరుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు. ప్రధాని మౌనం వీడాలి: విద్యార్థుల ఆవేదనను,వారి డిమాండ్లను అర్థంచేసుకుని ప్రధాని నరేంద్ర మోదీ వెంట నే స్పందించాలని, ఈఅంశం పై తమ మౌనాన్ని వీడి స్పష్టమైన ప్రకటన చేయాల ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల సాధన, వారి ఉజ్వల భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ వేదికగానూ, బయటా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# ఎదులాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలికల
# పాఠశాలలో ఏఐ డిజిటల్ ల్యాబ్ ప్రారంభం





టీడీఎఫ్ ‘మన తెలంగాణ బడి’ కార్యక్రమంలో భాగంగా ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ఊతం

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి:-** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘటకేసర్ మున్సిపాలిటీ అదిలాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ,టీడీఎఫ్ ,ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఏఐ కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించారు. టీడీఎఫ్ అమెరికా అట్లాంటా చాప్టర్, టీడీఎఫ్ ఇండియా సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌కు స్వాతి సుదిని, విక్రమ్ రెడ్డి సుదిని దంపతులు ఆర్థిక సహకారం అందించారు. ల్యాబ్‌లో ఐదు హై-పర్‌ఫార్మెన్స్ కంప్యూటర్లు, నెట్‌వర్కింగ్ వ్యవస్థతో పాటు ఆధునిక పరికరాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, డిజిటల్ అంతరాన్ని తగ్గించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. టీడీఎఫ్ ఇండియా అధ్యక్షులు మట్ట రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ‘మన తెలంగాణ బడి’ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత డిజిటల్ లెర్నింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు టీడీఎఫ్ కట్టుబడి ఉందని చెప్పారు. ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే సందర్భంగా టీడీఎఫ్ జైకిసాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘కమ్యూనిటీ ఆధారిత విత్తన బ్యాంక్’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దేశీయ విత్తనాలను పంపిణీ చేసి, సంప్రదాయ విత్తన సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. అలాగే కొండల వెంకట కృష్ణారెడ్డి బాలుర ప్రభుత్వ పాఠశాలకు మరో కంప్యూటర్ ల్యాబ్‌ను విరాళంగా అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో టీడీఎఫ్ అమెరికా వైస్ ప్రెసిడెంట్ స్వాతి సుదిని, విక్రమ్ రెడ్డి సుదిని, జాయింట్ ట్రెజరర్ అవినాష్ కళ్యాంకర్, కె. అరవింద్, టీడీఎఫ్ ఇండియా అధ్యక్షులు మట్ట రాజేశ్వర్ రెడ్డి, వనిత చేయూత చైర్‌పర్సన్ టి. వాణి, జైకిసాన్ చైర్మన్ పాటి నరేందర్ రెడ్డి, కొండల వెంకట కృష్ణారెడ్డి, కొండల విద్యాసాగర్ రెడ్డి, కొండల ప్రేమ్ సాగర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమెరికాకు చుక్కలు చూపిస్తున్న ఇరాన్.. 3 వారాల్లోనే 26,000 కోట్ల నష్టం.. యుద్ధ సెగతో వణికిపోతున్న అగ్రరాజ్యం!



ఇరాన్‌తో సాగుతున్న పోరులో అమెరికా రక్షణ వ్యవస్థకు భారీ గండి పడింది. అత్యంత ఖరీదైన ఖీ-15జు జెట్స్ నుండి అడ్వాన్స్‌డ్ రాడార్ సిస్టమ్స్ వరకు అన్నీ దెబ్బతిన్నాయి. ఈ నష్టాల నుండి కోలుకోవడానికి పెంటగాన్ ఏకంగా 200 బిలియన్ డాలర్ల అదనపు బడ్జెట్ కోరుతోంది. పూర్తి వివరాలు ఈ ఆర్టికల్‌లో చూడండి! ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు అగ్రరాజ్యం అమెరికాకు కోలుకోలేని ఆర్థిక, వ్యూహాత్మక దెబ్బ తీస్తున్నాయి. ఇరాన్‌తో సాగుతున్న ఈ ఘర్షణల వల్ల కేవలం మూడు వారాల వ్యవధిలోనే అమెరికా సైన్యం సుమారు 1.4 బిలియన్ డాలర్ల నుండి 2.9 బిలియన్ డాలర్ల వరకు నష్టపోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. అంటే భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.12,600 కోట్ల నుండి రూ.26,100 కోట్ల మధ్య ఉంటుందని అంచనా.

**పెంటగాన్ అదనపు బడ్జెట్ డిమాండ్:**

పెరుగుతున్న నష్టాలను భర్తీ చేసేందుకు, యుద్ధ సన్నద్ధతను కొనసాగించేందుకు పెంటగాన్ ఇప్పుడు వైట్ హౌస్ ముందు 200 బిలియన్ డాలర్ల భారీ అదనపు బడ్జెట్ ప్రతిపాదనను ఉంచేందుకు సిద్ధమవుతోంది. యుద్ధం ఇంకా పూర్తి స్థాయిలో మొదలుకాకముందే ఇంతటి భారీ వ్యయం కావడం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది.

**కూలిపోతున్న ఖరీదైన యుద్ధ విమానాలు:**

ఈ ఘర్షణల్లో అమెరికా తన అత్యంత ఖరీదైన ఫైటర్ జెట్‌లను కోల్పోయింది:

ఖీ-15జు స్ట్రైక్ ఈగిల్: కువైట్‌కు చెందిన విమానం పొరపాటున జరిపిన దాడిలో మూడు ఖీ-15జు విమానాలు కూలిపోయాయి. ఒక్కో విమానం ధర సుమారు 100 మిలియన్ డాలర్లు (రూ. 900 కోట్లు). ఖీ-35ూా లైట్నింగ్ II: అధునాతన సాంకేతికత కలిగిన ఈ విమానం అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చింది. దీనిని తామే కూల్చేశామని ఇరాన్ క్లెయిమ్ చేస్తోంది. దీని విలువ సుమారు 82.5 మిలియన్ డాలర్లు. డ్రోన్ వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ: అమెరికా నిఘా, దాడి వ్యవస్థలో కీలకమైన ఖీు-9 రీపర్ డ్రోన్లు ఒక డజనుకు పైగా ధ్వంసమయ్యాయి. ఒక్కో రీపర్ డ్రోన్ ధర కనీసం 16 మిలియన్ డాలర్లు కాగా, అడ్వాన్స్‌డ్ వెర్షన్ల ధర 30 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఇరాన్ మిసైల్ దాడులు వీటిని లక్ష్యంగా చేసుకున్నాయి. నేలకూలిన 'ఆకాశ ఇంధన ట్యాంకర్లు: గాలిలో యుద్ధ విమానాలకు ఇంధనం నింపే ఖజ-135 స్ట్రాటోట్యాంకర్లు కూడా ఈ యుద్ధంలో దెబ్బతిన్నాయి. ఇరాక్ ఆకాశంలో జరిగిన ప్రమాదంలో ఒక ట్యాంకర్ కూలిపోయి ఆరుగురు సైనికులు మరణించారు. సౌదీ అరేబియాలోని ఎయిర్ బేస్ మీద జరిగిన దాడిలో మరో ఐదు విమానాలు దెబ్బతిన్నాయి. వీటి స్థానంలో కొత్తగా కొనే ఒక్కో ఖజ-46 పెగాసస్ విమానం ధర దాదాపు 165 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,485 కోట్లు). ఖరీదైన రాడార్, డిఫెన్స్ సిస్టమ్స్: అమెరికా రక్షణ కవచం లాంటి వ్యవస్థలు కూడా ఇరాన్ దాడుల నుంచి తప్పించుకోలేకపోయాయి. జోర్డాన్‌లో ఉన్న ూాచీ/ఖ్-2 రాడార్ దెబ్బతింది. దీని విలువ 300 మిలియన్ డాలర్ల పైమాటే. కతర్ రాడార్: కతర్‌లోని అల్-ఉదీద్ ఎయిర్ బేస్‌లో సుమారు 1 బిలియన్ డాలర్ల (రూ. 9,000 కోట్లు) విలువైన అత్యంత అధునాతన రాడార్ వ్యవస్థ దెబ్బతిన్నట్లు సమాచారం. నౌకాదళానికీ తప్పని కష్టాలు: మిస్సైల్ దాడులే కాకుండా ఆపరేషనల్ లోపాల వల్ల కూడా అమెరికా నష్టపోతోంది. మార్చి 12న అమెరికా గర్వకారణమైన ఖూూ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ అనే విమాన వాహక నౌకలో అగ్నిప్రమాదం జరిగింది. ప్రస్తుతం దీనికి గ్రీస్‌లో మరమ్మతులు జరుగుతున్నాయి. నేరుగా భూతలంపై యుద్ధం ప్రారంభం కాకముందే కేవలం మూడు వారాల్లోనే అమెరికా ఇంతటి భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూడటం గమనార్హం. యుద్ధం గనుక ముదిరితే అగ్రరాజ్యానికి ఈ నష్టం ఊహించని రీతిలో పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు విశ్లేషకులు.

## ఉన్న ఊరిలోనే ప్రతీ నెలా రూ. 2 లక్షల వరకు సంపాదన.. ఎలాగో మీరూ చూడండి.!



తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే ఆర్గానిక్ లైవ్‌స్టాక్ బిజినెస్ ఐడియా గురించి ఇప్పుడు తెలుసుకోండి. పల్లెటూరి నాటుకోళ్లు, మేకల పెంపకం ద్వారా పట్టణాల్లో ఎలా ఆదాయం సంపాదించవచ్చో చూసేద్దాం. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఓ సారి తెలుసుకుందామా మరి. ఉద్యోగం చేసి విసిగిపోయిన చాలామంది ప్రస్తుతం సొంతంగా వ్యాపారం చేయాలని అనుకుంటారు. సరిగ్గా అలాంటివారి కోసమే ఈ బిజినెస్ ఐడియా. ఉన్న ఊరిలోనే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సంపాదించవచ్చు. వివరాల్లోకి వెళ్తే.! నేటికాలంలో స్వచ్ఛమైన, ఆర్గానిక్ ఆహారానికి గిరాకీ విపరీతంగా పెరుగుతోంది. గ్రామాల్లో సహజ సిద్ధంగా పెరిగే నాటుకోళ్లు, గొర్రెలు, మేకల పెంపకాన్ని ఒక బిజినెస్ మోడల్‌గా మార్చడమే ఈ ఐడియా. పట్టణాల్లో పెట్టుబడి పెట్టడానికి డబ్బు ఉండి, సరైన అవకాశం కోసం చూసేవారు.. గ్రామాల్లోని రైతులతో కలిసి ఈ వ్యాపారం ప్రారంభించవచ్చు. రైతులకు పెట్టుబడి ఇచ్చి, గొర్రె పిల్లలు లేదా నాటుకోళ్లను కొనిచ్చి పెంచమని అప్పగించడం ద్వారా ఇద్దరికీ లాభం చేకూరుతుంది.

**ఈ వ్యాపారంలో పశువుల ఆరోగ్యం అత్యంత కీలకం..**

పశువులు లేదా కోళ్లను ఒకే చోట కట్టివేయకుండా, సహజ సిద్ధమైన గడ్డి, పురుగులు తినేలా ఖాళీ ప్రదేశంలో పెంచాలి. సకాలంలో వ్యాక్సిన్లు వేయించడం, వెటర్నరీ నిపుణుల సలహాలు తీసుకోవడం ద్వారా వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చు. దూరంగా ఉండి పర్యవేక్షించేవారు ఆటోమేషన్ టూల్స్ లేదా కెమెరాల ద్వారా మానిటర్ చేయవచ్చు.

**సీజనల్ డిమాండ్**

అక్టోబర్ నుంచి మే నెల వరకు దసరా, దీపావళి, సంక్రాంతి లాంటి పండుగలతో పాటు పెళ్లిళ్ల సీజన్ ఉంటుంది. ఈ సమయంలో మాంసానికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ముందే ప్లాన్ చేసుకుని ఈ సమయానికి స్టాక్ సిద్ధం చేస్తే భారీ లాభాలు గ్యారెంటీ.

**మార్కెటింగ్, విక్రయాలు..**

గేటెడ్ కమ్యూనిటీలు: విల్లాలు, అపార్ట్‌మెంట్లలో నేరుగా సప్లై చేయవచ్చు.
స్పెషలైజ్డ్ స్టోర్స్: కేవలం నాటుకోళ్ల మాంసం మాత్రమే దొరికే రిటైల్ అవుట్‌లెట్స్ ప్రారంభించవచ్చు.
డిజిటల్ ప్లాట్‌ఫారమ్: వాట్సాప్ గ్రూపులు లేదా చిన్న యాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని నేరుగా కస్టమర్లకు డెలివరీ చేయవచ్చు.

## ఆధార్ ఇంట్లో మర్చిపోయారా..? అర నిమిషంలోనే వాట్సప్‌లో పొందవచ్చు.. నెంబర్ ఇదే..








వాట్సప్ ద్వారా అర నిమిషంలోనే ఆధార్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు. సెకన్లలోనే ఆధార్ సాఫ్ట్ కాపీ మీ వాట్సప్‌కు పీడీఎఫ్ ఫార్మెట్‌లో వచ్చేస్తుంది. ఇందుకోసం కేంద్రం ఒక వాట్సప్ నెంబర్ తీసుకొచ్చింది. దీని గురించి చాలామందికి తెలియక ఉపయోగించుకోలేకపోతున్నారు. ఎలా అంటే..

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్ కార్డు అనేది ప్రతీ పనికి అత్యవసర డాక్యుమెంట్‌గా మారిపోయింది. దీంతో ఎప్పుడూ దీనిని వెంట పెట్టుకోవాల్సి వస్తుంది. ఫిజికల్ డాక్యుమెంట్‌ను వ్యాలెట్‌లో ఉంచుకోవడమో లేదా సాఫ్ట్ కాపీని ఫోన్‌లో ఉంచుకోవడం అనేది




చాలా ముఖ్యం. ఒకవేళ మీరు ఇంట్లో ఆధార్ మర్చిపోయినా లేదా ఫోన్‌లో అందుబాటులో లేకపోయినా సింపుల్‌గా వాట్సప్ ద్వారా సెకన్లలోనే పొందవచ్చు.

**1 / 5**

వాట్సర్ ద్వారా ఆధార్ కార్డును డౌన్ లోడ్ చేసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. మై గోవ్ హెల్ప్ డెస్క్ ద్వారా ఈ సదుపాయం ఉంది. ఇందుకోసం ఒక వాట్సప్ నెంబర్‌ను ప్రవేశపెట్టారు. 9013151515 నెంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అనే మెస్సేజ్ చేయడం ద్వారా సులువుగా ఆధార్ పొందవచ్చు. పీడీఎఫ్ ఫైల్‌లో ఆధార్ పొందవచ్చు.

**2 / 5**

కానీ వాట్సప్ ద్వారా ఆధార్ డౌన్ లోడ్ చేసుకోవాలంటే ఖచ్చితంగా మీ మొబైల్ నెంబర్ ఆధార్‌కు లింక్ అయి ఉండాలి. ఇక డిజిలాకర్‌లోకి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా మీరు అర నిమిషంలోనే ఆధార్ వాట్సప్ ద్వారా పొందవచ్చు. ఈ ప్రాసెస్ ద్వారా మీరు ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

**3 / 5**







91-9013151515 నెంబర్‌కు వాట్సప్‌లో హాయ్ లేదా నమస్తే అని మెస్సేజ్ చేయండి. డిజిలాకర్ సర్వీసెస్‌ను ఎంచుకోండి. మీ 12 అంకెల ఆధార్ నెంబర్ నమోదు చేయండి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేయండి. మీ డిజిలాకర్‌లో ఆధార్‌ను సెలక్ట్ చేసుకోండి. ఆ తర్వాత మీ ఆధార్ పీడీఎఫ్ ఫార్మట్లో వాట్సప్‌కు అందుతుంది.

**4 / 5**

మీ మొబైల్ నెంబర్ యాక్టివ్‌గా ఉండాలి. ఆధార్ డిజిలాకర్‌తో లింక్ అయి ఉండాలి. మీ ఆధార్‌కు మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాలి. ఈ మూడు ఉంటేనే వాట్సప్‌లో ఆధార్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

## షాకింగ్ న్యూస్.. భారీగా పెరగనున్న స్మార్ట్‌ఫోన్, టీవీ, వాషింగ్ మెషిన్ల ధరలు..



మధ్యతరగతి ప్రజలకు షాకింగ్ న్యూస్. త్వరలో స్మార్ట్ ఫోన్లతో పాటు ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషిన్ల ధరలు భారీగా పెరగనున్నాయి. వచ్చే నెలలోనే భారీగా పెరుగుతాయని తెలుస్తోంది. అసలే ఎండాకాలం కావడంతో ఇంట్లో ఏసీ, రిఫ్రిజిరేటర్లు వంటివి తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పిడుగులాంటి వార్త. స్మార్ట్‌ఫోన్, టీవీ, ఏసీల ధరలు భారీగా పెరుగుతున్నాయి. గత ఏడాదిలో కేంద్రం జీఎస్టీ రేట్లను తగ్గించడంతో వీటి ధరలు దిగొచ్చి సామాన్యులకు ఊరట కలిగించాయి. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో పాటు దేశంలోనే తయారుచేయడం, టెక్నాలజీ పెరగడం వల్ల ధరలు తగ్గాయి. ఇక కేంద్రం ఎలక్ట్రానిక్ వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల కూడా ధరలు తగ్గుతూ వచ్చాయని చెప్పవచ్చు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది

**1 / 5**

అయితే స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషిన్ల ఏసీల తయారీకి అవసరమయ్యే ముడి సరుకు ధరలు గత కొద్ది నెలలుగా పెరుగుతున్నాయి. ఇక వాటిల్లో వాడే చిప్‌లకు కొరత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల కంపెనీలు ధరలను పెంచేస్తున్నాయి. వచ్చే నెల





నుంచి ధరలను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఖర్చులు పెరుగుతుండటం వల్ల ధరలను నియంత్రించలేకపోతున్నామని, తమ చేతుల్లో ఏమీ లేదని కంపెనీలు తేల్చేస్తున్నాయి.

**2 / 5**

ఎంట్రీ లెవల్ టీవీ, స్మార్ట్ ఫోన్ల ధరలతో పాటు వాషింగ్ మెషిన్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 8 నెలల క్రిందట ఉన్న గరిష్ట స్థాయి ధరలకు మళ్లీ చేరుకోనున్నాయి. ధరలు రికార్డ్ స్థాయికి త్వరలో చేరుకోనున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వేసవి సీజన్ కావడంతో ఏసీ, రిఫ్రిజిరేటర్లు సేల్స్ ఎక్కువగా ఉంటాయి. దీంతో సేల్స్ పెంచకపోతే ఎంట్రీ లెవల్ సెగ్మెంట్ డిమాండ్ మరింత బలహీనపడవచ్చు.

**3 / 5**

ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్ ధరలు గత ఏడాది దీపావళి






సమయంలో రూ.10 వేల వరకు ఉండగా.. ఇప్పుడు రూ.14 వేలకు చేరుకోనున్నాయి. ఇక వచ్చే ఏడాది నాటికి రూ.18 వేలకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. రాబోయే మూడు నెలల్లో కొన్ని బ్రాండ్ల బేసిక్ ఫోన్ ధరలు రూ.20 వేలకు చేరుకోవచ్చని చెబుతున్నారు. ఇక 32 అంగుళాల స్మార్ట్ టీవీ ధరలు గత ఏడాది రూ.6500గా ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.8500కి చేరుకున్నాయి. మే లోపు రూ.10 వేలకు చేరుకోవచ్చంటున్నారు.

**4 / 5**

ఇక 1.5 టన్నుల 3 స్టార్ ఏసీల ధరలు గత ఏడాది రూ.32 వేలుగా ఉండగా.. ఇటీవల రూ.34 వేలకు చేరుకున్నాయి. ఇక ఏప్రిల్‌లో రూ.40 వేల వరకు చేరుకోవచ్చని అంటున్నారు.

## ప్రజలకు గుడ్‌న్యూస్.. ఇక రేషన్ షాపు, పెట్రోల్ పంపుల్లో కిరోసిన్.. కేంద్రం కీలక నిర్ణయం






ఖవతీశీంవఅవ: ఇంధన రిటైల్ నెట్‌వర్క్ ద్వారా వేగవంతమైన పంపిణీని నిర్ధారించడానికి, ఈ నిర్ణయం గతంలో దశలవారీగా నిలిపివేసిన ప్రాంతాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా కిరోసిన్ సరఫరాను తాత్కాలికంగా పునఃప్రారంభిస్తుంది. ఈ కాలంలో పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పిఇఎస్ఓ) జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలు.. ఖవతీశీంవఅవ: పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలకు అంతరాయం కలిగించి, అనేక దేశాల్లో ఇంధన కొరతకు కారణమైంది. భారతదేశం కూడా ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో గృహాలకు కిరోసిన్ సరఫరాను సులభతరం చేయడానికి ప్రభుత్వం పెట్రోలియం భద్రత, లైసెన్సింగ్ నిబంధనలను తాత్కాలికంగా సడలించింది. దుర్వినియోగాన్ని నివారించడానికి కిరోసిన్‌ను వంట, దీపాలు వెలిగించడం వంటి గృహ వినియోగానికి మాత్రమే సరఫరా చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మార్పుల ప్రకారం, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలచే నిర్వహించే ఎంపిక చేసిన పెట్రోల్ పంపులకు కిరోసిన్‌ను నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చింది. ఎంపిక చేసిన పెట్రోల్ పంపులు 5,000 లీటర్ల వరకు కిరోసిన్‌ను నిల్వ చేయగలవు. ప్రతి జిల్లాలో గరిష్టంగా రెండు పెట్రోల్ పంపులను కిరోసిన్ అమ్మకానికి అందుబాటులో ఉండేలా నిర్దేశిస్తారు. సరఫరా గొలుసును వేగవంతం చేయడానికి, చివరికి పంపిణీని నిర్ధారించడానికి, కిరోసిన్ నిల్వ, రవాణా, పంపిణీలో పాలుపంచుకునే డీలర్లు, వాహనాలకు పెట్రోలియం నియమాలు, 2002లోని కొన్ని లైసెన్సింగ్ నిబంధనల నుండి మినహాయింపు ఇచ్చినట్లు కూడా ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇప్పటికే ఉన్న ఇంధన రిటైల్ నెట్‌వర్క్ ద్వారా వేగవంతమైన పంపిణీని నిర్ధారించడానికి, ఈ నిర్ణయం గతంలో దశలవారీగా నిలిపివేసిన ప్రాంతాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా కిరోసిన్ సరఫరాను తాత్కాలికంగా పునఃప్రారంభిస్తుంది. ఈ కాలంలో పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పిఇఎస్ఓ) జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలు, కార్యాచరణ నియమావళి అమలులో ఉంటాయి.

**భారతదేశంలో కిరోసిన్‌ను నిషేధించారా?**

భారతదేశంలో కిరోసిన్ అమ్మకాలను దేశవ్యాప్తంగా పూర్తిగా నిషేధించలేదని, కానీ దశలవారీగా తొలగించారని గమనించాలి. కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఉజ్వల యోజన, సౌభాగ్య యోజనల ద్వారా ఎల్‌పిజి, విద్యుత్ కనెక్షన్‌లను ప్రోత్సహించడం ప్రారంభించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్/రేషన్ షాపులు) ద్వారా రాయితీ కిరోసిన్ అమ్మకాలను కూడా క్రమంగా దశలవారీగా తొలగించారు. ఢిల్లీ, హర్యానా, చండీగఢ్ 2018-2020 మధ్య ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) కింద కిరోసిన్ అమ్మకాలను నిలిపివేసి, తమను తాము కిరోసిన్ రహిత రాష్ట్రాలుగా ప్రకటించుకున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా సబ్సిడీ కిరోసిన్ అమ్మకాలను నిలిపివేయడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం కాలుష్యాన్ని తగ్గించడం, పెట్రోల్, డీజిల్‌లో కల్తీని నివారించడం, సబ్సిడీల భారాన్ని తగ్గించడం. 2020 నాటికి చాలా ప్రాంతాలలో పంపిణీ వ్యవస్థ దాదాపుగా కుప్పకూలిపోయింది. ఎల్‌పిజి, విద్యుత్ లభ్యత పరిమితంగా ఉన్న రాష్ట్రాలలో పరిమిత కిరోసిన్ సరఫరా కొనసాగింది. సబ్సిడీలు ముగియడంతో బహిరంగ మార్కెట్లో దాని ధర పెరిగింది. ఎల్‌పిజి కనెక్షన్లు, గ్యాస్ సిలిండర్లు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో కిరోసిన్ వినియోగం తగ్గింది. క్రమంగా కిరోసిన్ మార్కెట్ నుండి కనుమరుగైంది. దీంతో ప్రభుత్వం దానిని పూర్తిగా నిషేధించలేకపోయింది.



**బాత్రూంలో ఉప్పు పెడితే డబ్బులే డబ్బులు.. వాస్తు శాస్త్ర రహస్యాలివే..!**

భారతదేశంలో ఎల్పీజీ సంక్షోభం ఎందుకు ఉంది?

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణే భారతదేశంలోని ఎల్‌పిజి సంక్షోభానికి కారణం. ఇరాన్ అణు, క్షిపణి కార్యక్రమాలే కారణమని ఆరోపిస్తూ, అమెరికా, ఇజ్రాయెల్ 2026 ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడి చేశాయి. అమెరికా, దాని మిత్రదేశాలపై ఒత్తిడి పెంచడానికి ఇరాన్ హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించింది. ఇది ప్రపంచంలోని ప్రధాన సముద్ర మార్గాలలో ఒకటి. దీని ద్వారా ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలలో సుమారు 20 శాతం వెళుతుంది. హోర్ముజ్ దిగ్బంధనం ప్రపంచ ఇంధన సరఫరాలను ప్రభావితం చేసింది. భారతదేశం తన ఎల్‌పిజి అవసరాలలో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. ఈ గ్యాస్‌లో సుమారు 50 శాతం గల్ఫ్ దేశాల నుండి వస్తుంది. అందువల్ల, సరఫరా గొలుసులో ఏ అంతరాయం ఏర్పడినా అది దేశీయ మార్కెట్‌పై నేరుగా ప్రభావం చూపుతుంది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815